



తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో మునిగిన వరి పంట, శంకరపట్నం మండలం అంబాలాపూర్‌లో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



చెరువును తలపిస్తున్న నగునూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం, నీళ్లను మళ్లిస్తున్న రైతు



చిగురుమామిడి మండలంలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని చూస్తున్న రైతు





- రైతులను నట్టేట ముంచిన మొంథా తుఫాన్
- 3,512 ఎకరాల్లో తడిసి ముద్దయిన పత్తి
- 11,614 క్వింటాళ్ల వరి పంటకు నష్టం
- పలు చోట్ల దెబ్బతిన్న రోడ్లు.. కూలిన ఇళ్లు

వర్షంతో అపార నష్టం

కరీంనగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మొంథా తుఫాన్ పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. బుధవారం కురిసిన భారీ వర్షానికి ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం కళ్ల ముందే కొట్టుకు పోవడం, కోతకు వచ్చిన పంట నీట మునగడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. జిల్లాలో అత్యదికంగా సాగు చేసే వరి, పత్తి పంటలకు తుఫాన్ తీవ్ర నష్టం కలిగించింది. వారంరోజులుగా ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొను గోలు కేంద్రాలు, వ్యవసాయ మార్కెట్ యార్డులకు తరలించారు. తేమశాతం ఎక్కువగా ఉండడంతో ఆర బెట్టుకున్నారు. ఆ ధాన్యమంతా తడిసి ముద్దయింది. రోడ్ల పక్కన ఆరబెట్టిన వరి ధాన్యం భారీ వర్షానికి వచ్చిన వరదలో కొట్టుకుపోయింది.

వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం

జిల్లా వ్యవసాయశాఖ అధికారులు వేసిన అంచనా మేరకు జిల్లాలోని 183 గ్రామాల పరిధిలోని 3,321 మంది రైతులకు సంబంధించిన 3,512 ఎకరాల్లో పత్తి చేన్లు తడిసి ముద్దయ్యాయి. అత్యధికంగా కొత్తపల్లి మండలంలో 1200 ఎకరాల్లో, ఇల్లందకుంట మండలంలో 300 ఎకరాలు, జమ్మికుంటలో 200 ఎకరాలు, సైదాపూర్‌లో 324 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. జిల్లాలోని 15 మండ లాల్లో వరి పంటకు తీవ్ర నష్టం కలిగింది. 26,441 మంది రైతులకు సంబంధించిన 30,560 ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి తీసుకు వచ్చిన వరి ధాన్యం తడిసి ముద్దయింది. చాలా చోట్ల రైతులు రోడ్ల వెంట ఆర బెట్టిన ధాన్యం వరదకు కొట్టుకుపోయింది. జిల్లాలో ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో 4,684 క్వింటాళ్లు, డీసీఎంఎస్ కేంద్రాల్లో 6,690 క్వింటాళ్లు, హాకా పరిధిలోని కొనుగోలుకేంద్రాల్లో 270 క్వింటాళ్ల ధాన్యం తడిసింది. మొత్తం జిల్లాలో 11,644 క్వింటాళ్ల ధాన్యం, 3,512 ఎకరాల్లోని పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారుల సమాచారం.

మండలాల వారీగా..

వీణవంక మండలంలోని 26 గ్రామాల్లో 1,250 ఎకరాల వరి పంట, 220 ఎకరాల పత్తిపంట వరద నీటిలో మునిగింది. హుజూరాబాద్ మండలంలోని 19 గ్రామాల్లో 3,959 ఎకరాల్లోని వరి పంట నీటిపాలైంది. జమ్మికుంట మండలంలో 400 ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో పత్తి పంటకు నీట మునిగి నష్టం వాటిల్లడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంపై టార్పాలిన్లను వేసినప్పటికీ భారీ వర్షంతో ధాన్యం తడిసి ముద్దయింది. ఇల్లందకుంట మండలంలో 1,200 ఎకరాల వరి పంట దెబ్బ తినగా, 300 ఎకరాల్లో పత్తిపంట తడిసి దెబ్బతిన్నదని రైతులు వాపోతున్నారు. శంకరపట్నం మండలంలో 1,500 ఎకరాల వరి పంట నీట మునిగింది. గన్నేరువరం మండలంలో 1,700 ఎకరాల్లో వరి పంట, 270 ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు. మానకొండూర్ మండలంలోని 1,800 ఎకరాల్లో వరి పంట, 220 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. సైదాపూర్ మండలంలో 2,447 ఎకరాల్లో వరి పంట, 518 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగింది. 2,270 క్వింటాళ్ల ధాన్యం వరదలో కొట్టుకుపోయింది. కరీంనగర్ రూరల్ మండలంలో 2,498 ఎకరాల్లో సాగు చేసిన వరి పంట,

మిగతా 8వపేజీలో..



తిమ్మాపూర్‌లో నేలవాలిన వరి





సైదాపూర్ మండలంలో మొలక వచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్‌ఆలం



ఉధృతంగా ప్రవహిస్తున్న శంకరపట్నం మండలం గద్దపాక వాగు



జలమయమైన సైదాపూర్ మండలం సోమారం చౌరస్తా



చెర్లబూత్కూర్‌లో పత్తి చేనులో నీరు



చిగురుమామిడి మండలం రేకొండలో మృతి చెందిన ఆవులు

నష్టాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్: మండలంలో వర్షానికి దెబ్బతిన్న ప్రాంతాలను రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పరిశీలించారు. రోడ్ల మరమ్మతులకు వెంటనే నిధులు మంజూరు చేస్తామన్నారు. వరదలకు కొట్టుకుపోయిన రోడ్లు, నష్టపోయిన పంటలను మొత్తం రికార్డ్ చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్‌ఆలం, అడిషనల్ కలెక్టర్ల అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీకిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్, సైదాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, సింగిల్ విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఇందుర్తి- కోహెడ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి

చిగురుమామిడి: వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి హుస్నాబాద్‌కు వస్తున్నారని, ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడి ఇందుర్తి-కోహెడ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో తెగిన రోడ్డును, ఇందుర్తి ఎల్లమ్మ వాగును, పొలాలను, తడిసిన ధాన్యాన్ని అయన పరిశీలించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్, తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం వివరాలు సేకరించాలి..

కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షానికి తడిసిన ధాన్యం వివరాలను సేకరించాలని కలెక్టర్ సత్పతి అధికారు లను ఆదేశించారు. తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో పంట నష్టం, తీసుకోవాలసిన చర్యలపై కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా ఉన్నతాధికారులతో గరువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాలతో ఎనిమిది పశువులు మరణించాయని, వాటి యజమానులకు వెంటనే నష్టపరి హారం అందించేలా చర్యలు తీసుకోవాలని పశుసంవర్థక శాఖ అధికా రులను ఆదేశించారు. పాక్షికంగా, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లు ఏవైనా ఉంటే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వెంటనే పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాలతో సుమారు 2,036 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లుగా సమాచారముందని, రైతులవారీగా తడిసిన ధాన్యం వివరాలను సేకరించాలని అన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైసు మిల్లులకు పంపించాలని సూచించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో పూర్తి స్థాయిలో టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ఎట్టి పరిస్థితిలోనూ తడవకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే పత్తి కొనుగోళ్లను తిరిగి ప్రారంభించాలని ఆదేశించారు. వర్షాలపై రెవెన్యూ, పోలీసు, పంచాయతీ కార్యదర్శులు ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో నీరు పారుతున్న కల్వర్టులపై నుంచి వాహనాలు, మనుషులు వెళ్లకుండా చూడాలని, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. నగరంలో నీరు నిలిచిన చోట దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్లు అశ్వినీ తానాజీ వాఖడే, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్, అధికారులు పాల్గొన్నారు.

విలీన డివిజన్లలో అభివృద్ధికి చర్యలు తీసుకోండి



నీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల డివిజన్లలో అభివృద్ధి, మౌలిక సదుపాయాలకల్పనకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా యూఐడీఎఫ్ నిధుల అభివృద్ధి, 15వ ఆర్థిక సంఘం నిధుల అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్‌కు సంబంధించి 50 కోట్ల రూపాయల నిధులకు ప్రభుత్వం మంజూరు ఇచ్చిందన్నారు. అభివృద్ధి పనుల ప్రతిపాదనలను తయారు చేయాలని ఆదేశించారు.

వరద నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలి

వర్షాలతో రోడ్లపై వరద నీరు నిలువకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కురిసిన భారీ వర్షానికి నగరంలోని పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాలను గురువారం కమిషనర్ సందర్శించారు. ఇంజనీరింగ్ అధికారులు, డిజాస్టర్ సిబ్బందికి సూచనలు చేశారు.

వరదలపై అప్రమత్తంగా ఉండండి : సీడీఎంఏ శ్రీదేవి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వరదపై నగరపాలక సంస్థ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శ్రీదేవి ఆదేశించారు. గురువారం ఆమె జూమ్ సమావేశంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరదల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, నగర ప్రజల రక్షణ చర్యలు, వరదల ద్వారా చెడిపోయిన రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు, డివైడర్లు, మ్యాన్ హోల్స్, మంచినీటి సరఫరా పైపులైన్లు అంశాలపై చర్చించారు. నగరంలో వర్షపాతం, వరదల పరిస్థితిని అడిగి తెలుసుకొని తీసుకోవలసిన జాగ్రత్త చర్యలపై అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ సంజీవ్‌కుమార్, ఏసీపీలు వేణు, శ్రీధర్ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): గర్భిణులకు టీ-హబ్‌లో ముందస్తు పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ సిబ్బదిని ఆదే శించారు. గురువారం వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సికిల్ సెల్ యాప్ వాడకంపై మహిళా ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని సూచిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు సికిల్ సెల్ స్క్రీనింగ్ నిర్వహించాలన్నారు. ముందస్తు స్క్రీనింగ్ లక్షణాలను, వ్యాధిని గుర్తించడంలో సహాయపడుతుందని తెలిపారు. ఎంసీహెచ్ పీవో డాక్టర్ సన జవేరియా మాట్లాడుతూ మహిళా ఆరోగ్య కార్యకర్తలు వారి పరిధిలోని గర్భిణులకు వంద శాతం స్క్రీనింగ్ చేయాలని ఆదేశించారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి'

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన

గణేశ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి లను విడుదల చేయాలని కరీంనగర్ తెలంగాణ చౌక్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గురువారం నిరసన తెలిపారు. రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది వేల కోట్లకు పైగా విద్యార్థులు రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అధికారంలోకి రాగానే బకాయిలు విడుదల చేస్తానని మేనిఫెస్టోలో పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పట్టింకుకోవడం లేదని విమర్శించారు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు కళాశాలకు వెళ్తే ఫీజులు కడితేనే ఇస్తామని యాజమాన్యాలు వేధిస్తున్నాయన్నారు. నిధులు విడుదల చేయాలని అడుగుతున్న కళాశాలలపైన రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ దాడులు చేయించడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్తుపై ఏ మాత్రం లేదన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక్కరోజు కూడా విద్యార్థుల పక్షాన కేబి నెట్లో మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా విద్యార్థులు రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆసపెల్లి వినయ్ సాగర్, దుర్గం భోగేష్, జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్, జిల్లా కమిటీ సభ్యులు అంబాల సందేశ్, రాకేష్, రక్షక్, నరేష్, నాయకులు సన్నీ, అంజి, అభి, అజయ్ పాల్గొన్నారు.



తెలంగాణ చౌక్ వద్ద నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలు

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం పెద్దపల్లిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పెంజర్ల లక్ష్మీనారాయణ(35) బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈక్రమంలో బస్టాండ్ నుంచి గోదావరిఖని వెళ్లే బస్సు సిగ్నల్ వద్ద లక్ష్మీనారాయణను ఢీకొట్టింది. స్థానికులు వెంటనే అతన్ని ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. అప్పటికే వైద్యులు అతడు మృతిచెందినట్లు ప్రకటించారు. మృతుడు లక్ష్మీనారాయణ తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్జంపేట గ్రామానికి చెందిన దేశినిరాజు గురువారం తాడిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కింద జారిపడ్డాడు. అతని కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కాగా, మాజీఎంపీపీ సారయ్యగౌడ్, మాజీఎంపీటీసీ పోసాల సదానందంతోపాటు గ్రామస్థులు కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజును కరీంనగర్‌కు తరలించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన ఒకరికి జైలు శిక్ష

● ముగ్గురికి జరిమానా

కోల్‌సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఒకరికి జైలు శిక్ష, ముగ్గురికి జరిమానాను గోదావరిఖని సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ విధించినట్టు రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బీ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. గోదావరిఖనికి చెందిన రాయమల్లు అనేవ్యక్తి మద్యం సేవించి రెండోసారి పట్టుబడగా అతనికి మూడురోజుల జైలు శిక్ష విధించి కరీంనగర్ జైలుకు తరలించిట్టు, మరోముగ్గరికి రూ.6వేల జరిమానా విధించినట్టు ఆయన తెలిపారు.

ఇసుక మాఫియాపై అధికారుల కొరడా



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ట్రాక్టర్లు, టిప్పర్లు (ఫైల్)

దాడులకు దిగిన మాఫియా

కోరుట్ల మండలం నాగులపేట, సంగెం, కథలా పూర్ మండలం తక్కళ్ళపల్లికి చెందిన పలువురు రెవెన్యూ సిబ్బందిపై దాడులకు దిగిన ఘటనలు చోటుచేసుకున్నాయి. వరద కాలువ వెంట భారీ డంపులను ఏర్పాటు చేసుకున్న మాఫియా అటు వరద కాలువపై అనునిత్యం నిఘా ఉండే లష్కర్లను కూడా బెదిరించిన ఘటనలు ఉన్నాయి. దీంతో రాత్రి వేళల్లో అధికారులు, పోలీసులు వరుసగా దాడులు చేస్తూ ట్రాక్టర్లు, టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు.

ప్రత్యేక బృందాలతో నిఘా



వినోద్, తహసీల్దార్, కథలాపూర్

గ్రామాల్లో జీపీవోలు, ఆఫీస్ అసిస్టెంట్లు, పోలీసులతో కలిసి నిరంతరం దాడులు చేస్తున్నాం. వాగు వెంట ఇసుక మాఫియా తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న దొంగదారుల వద్ద నిఘా ఉంచాం. ట్రాక్టర్లు, టిప్పర్లు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించాం. ఉన్నతాధికారులు భారీ జరిమానాలు విధించాలనే నిబంధన పెట్టారు.

● రెవెన్యూ బృందాల ఆకస్మిక దాడులు

● ట్రాక్టర్లు, టిప్పర్లు పట్టివేత

కథలాపూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలో రెవెన్యూ, పోలీసు, మైనింగ్, స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ విభాగాలు ఇసుక మాఫియాపై కొరడా ఝుళిపిస్తున్నాయి. గ్రామ పాలనాధికారులతో కలిసి బృందాలు ఎప్పటికప్పుడు కథలాపూర్ మండలంలోని పెద్దవాగులో రాత్రివేళల్లో నిఘా పెంచి ఆకస్మికంగా దాడులు చేస్తుండడంతో అక్రమార్కులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కథలాపూర్ పెద్దవాగు వెంట ప్రతీ రోజు సుమారు వంద ట్రాక్టర్లు, పదుల సంఖ్యలో టిప్పర్లతో ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గ్రామ శివారుల్లో పలు ప్రాంతాల్లో ఇసుక నిల్వ చేసి అక్కడి నుంచి టిప్పర్లతో ఇతర జిల్లాలకు సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాగును ఆనుకొని ఉన్న రైతుల భూములు కోతకు గురై ఇసుక మేటలు పెట్టగా సదరు రైతులకు డబ్బులు చెల్లించి కొందరు అక్రమార్కులు ఇసుకను కొనుగోలు చేసి వేరే ప్రాంతాల్లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. భారీ టిప్పర్లతో ఇసుకను అక్రమంగా రవాణా చేయడంతో రోడ్లన్నీ ధ్వంసం కాగా ఇటీవల భీమారం మండలం మన్నెగూడెం వద్ద గ్రామస్తులు టిప్పర్లను అధికారు లకు పట్టించారు. ఇటీవల కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశాలతో కథలాపూర్ మండలంలోని తక్కళ్ళపల్లి, బొమ్మెన, సిరికొండ, పోసానిపేట, తాండ్ర్యాల, గం భీర్‌పూర్ గ్రామాల్లో అధికారులు ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెంచారు.

హత్యాయత్నం కేసులో ఏడాది జైలు శిక్ష

జగిత్యాల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించడంతో పాటు హత్యాయత్నం చేసిన సంఘటనలో నిందితుడికి కరీంనగర్ మూడవ ఆడిషనల్ సెషన్స్ జడ్జి నీరజ ఏడాది కఠిన కరాగార జైల్ శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువరించారు. వివ రాల్లోకి శితే.. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన సాగర్, నితిన్ ఇద్దరు స్వంత అన్నదమ్ములు కాగా, అదే గ్రామానికి చెందిన బత్తిని సంతోష్, నితిన్ ఇద్దరు మిత్రులు. అయితే, తన తమ్ముడిని నీతో తిప్పుకుంటూ వాడి చదువు నాశనం చేస్తున్నావ్ అంటూ సాగర్ సంతోష్‌ను మందలించడానికి యత్నించాడు. దీంతో తీవ్ర అసహానానికి గురైన సంతోష్ కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా గాయపర్చి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు పోలసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి డీఎస్పీ వెంకటరమణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశాడు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితుడికి కఠిన కారాగార జైల్ శిక్షతో పాటు వెయ్యి జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన పోలీసులను జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

ఇసుక లారీ పట్టివేత

తిమ్మాపూర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అక్రమంగా, అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న లారిని పట్టుకున్నట్లు ఎల్ఎండి ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. తిమ్మాపూర్ బస్టాండ్ సమీపంలో అక్రమంగా, అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుకతో కూడిన లారీని ఎల్ఎండి పోలీసులు పట్టుకున్నారు. పెద్దపల్లి జిల్లా నుంచి సిద్దిపేటకు తీసుకువెళ్తున్న లారీని తిమ్మాపూర్ బస్టాండ్ సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టషన్‌కు తరలించినట్లు తెలిపారు. లారీ డ్రైవర్ మర్రి నాగరాజుపై కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పంటపొలాలు నీట మునిగాయని రైతుల రాస్తారోకో

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి పనులు చేపట్టిన డీబీఎల్ రోడ్డు కంపెనీ నిర్లక్ష్యం కారణంగా తమ పంట పొలాలు నీట మునిగాయని గురువారం మండలంలోని సింగాపూర్ గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై రైతులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సింగాపూర్ చెరువు వద్ద రోడ్డు నిర్మాణ సంస్థ సరైన బ్రిడ్జిని నిర్మించకపోవడం వలన పంటలు నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు మత్తడి పొంగిన సమయంలో నీరు సక్రమంగా పోక, బ్యాక్ వాటర్‌తో గ్రామానికి చెందిన దాదాపు 150 ఎకరాల వరి పంట పూర్తిగా మునిగిపోయిందన్నారు. వారం రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంటలు నీట మునగడంతో లక్షల్లో నష్టాపోయాని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. తుమ్మనపల్లి సింగిల్ విండో చైర్మన్ కౌరు సుగుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ సింగాపూర్ చెరువు వద్ద సరైన బ్రిడ్జి నిర్మించాలని జాతీయ రహదారుల డైరెక్టర్ కృష్ణారెడ్డికి, ఇరిగేషన్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించకపోవడం మూలంగా రైతులు పంట నష్టపోయారన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న సీఐ సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించి పరిష్కారానికి చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరవించారు.



సింగాపూర్‌లో ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

ప్రవాహంలో కొట్టుకుపోయిన యువకుడు

● స్థానికుల సాయంతో సురక్షితంగా ఒడ్డుకు

గన్నేరువరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం చెరువు వద్ద కల్వర్టుపై ప్రవహించే వరదనీటిలో మండల కేంద్రం నుంచి కరీంనగర్‌కు వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై వెళుతూ బీహార్‌కు చెందిన రజీప్ అనే యువకుడు వరద ఉధృతికి నీటిలో కొట్టుకుపోయాడు. మత్తడి వద్ద గతంలో నిమజ్జనం చేసిన దుర్గామాత విగ్రహ స్టాండు వరదనీటిలో అతడి చేతికి అందడంతో దానిని పట్టుకొని ప్రాణాలతో బయటపడ్డాడు. వెంటనే స్థానిక మత్స్యకారులు గమనించి అతడిని తాడు సహాయంతో బయటకు తీశారు. వరద ఉధృతి ఉన్నందున కల్వర్టుపై వెళ్లకూడదని పోలీసులు స్టాపర్‌లను ఏర్పాటు చేసినప్పటికీ దానిని లెక్క చేయకుండా వెళ్లడంతో ప్రమాదం చోటుచేసుకుంది.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వీణవంక,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి):మండలంలోని రెడ్డిపల్లి గ్రామనికి చెందిన సుకాశి నరేష్ (35) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం నరేష్ కొంత కాలంగా మద్యానికి బానిస కాగా భార్య తన ఇద్దరు కూతళ్లతో వాళ్ల అమ్మగారింటికి వెళ్లింది. అప్పటి నుంచి తాగుతూ గ్రామంలోని వాళ్లతో గొడవపడుతున్నాడు. మంగళవారం మద్యం తాగి నరేష్ తన అన్న సురేష్‌కి ఫోన్ చేసి తిట్టడంతో సురేష్ రెడ్డిపల్లిలో నరేష్ వద్దకు వెళ్లి నెట్టి వేయడంతో బండపై పడి తలకు తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే వరంగల్ ఎంజీఎం అసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్టు తెలిపారు. మృతుని తండ్రి సుకాని రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్లు సీఐ లక్ష్మీనారయణ, ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

మానేరు వాగులో గల్లంతైన 16వేల బాతులు

మానకొండూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీనివాస్‌నగర్ శివారులోని మానేరు వాగులో బుధవారం రాత్రి 16వేల బాతులు గల్లంతు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాకు చెందిన డేవిడ్ అనే వ్యక్తి బతుకు దెరువు కోసం 16వేల బాతులతో మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామ శివారులోని మానేరు వాగులో తాత్కాలిక డేరా వేసుకొని జీవిస్తున్నాడు. ఎల్ఎండీ గేట్లు ఎత్తివేయడంతో వరద తాకిడికి 16వేల బాతులు గల్లంతు కాగా తమ కుటుంబం తప్పించుకొని ఒడ్డుకు చేరుకున్నట్లు బాధితుడు డేవిడ్ వాపోయాడు. సుమారు వీటి విలువ రూ. 20లక్షలు ఉంటుందని బాధితుడు లబోదిబో మంటున్నాడు.

మానేరులో దూకి ఒకరి గల్లంతు

తంగళ్లపల్లి, అక్టోబరు 30 (ఆంధజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సల్లంగుల కృష్ణ(60) మానేరు నదిలో దూకి అదృశ్యమైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుం బ సభ్యుల కథనం.. కృష్ణ కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తుండగా ఉపాధి లేకపోవడంతో పాటు అనారోగ్య సమస్యలు తోడయ్యాయి. ఆసుపత్రికి వెళ్తున్నాని కుటుంబ సభ్యులకు చెప్పి ఉదయం బయల్దేరిన కృష్ణ సాయంత్రం తంగళ్లపల్లి మానేరు వంతెన పైనుంచి నదిలో దూకాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెట్‌పల్లివాసి మృతిని ధ్రువీకరించిన ఎంబసీ

● ఐదేళ్లుగా బహ్రెయిన్ మార్చురీలోనే మృతదేహం ● అక్కడే అంత్యక్రియలు

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బహ్రెయిన్‌లో చనిపోయిన ఐదేళ్ల తర్వాత జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణం రాంనగర్‌కు చెందిన శ్రీపాద నరేష్ అనే వ్యక్తికి ఇండియన్ ఎంబసీ మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేసింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణం రాంనగర్‌కు చెందిన శ్రీపాద నరేష్ 2020 మే 28న బహ్రెయిన్ దేశంలోని ఓ ఆసుపత్రిలో మృతి చెందాడు. కాగా బహ్రెయిన్‌లోని ఇండియన్ ఎంబసీ 2025 అక్టోబరు 1న డెత్ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి అక్టోబరు 30న అధికారికంగా ఈ-మెయిల్ ద్వారా తెలియజేసింది. అనారోగ్యంతో చనిపోయిన శ్రీపాద నరేష్ మృతదేహాన్ని బహ్రెయిన్‌లోని ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. బహ్రెయిన్‌లోని ఇండియన్ ఎంబసీ అధికారులను ఉటంకిస్తూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో శ్రీపాద నరేష్ ఐదేళ్ల క్రితం మృతిచెందిన విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడి సోదరుడు ధర్మపురి ఆనంద్ సహాయం కోసం ఈనెల 21న హైదరాబాద్‌లో 'సీఎం ప్రవాసీ ప్రజావాణి'ని ఆశ్రయించారు. నరేష్ మృతదేహాన్ని భారత్‌కు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాగా శ్రీపాద నరేష్ చనిపోయి చాలాకాలం అయినందున మృతదేహాన్ని భారత్‌కు తరలించడం సాధ్యం కాదని, అంత్యక్రియలు బహ్రెయిన్‌లోనే నిర్వహించాలని మృతుడి బంధువులకు ఎంబసీ సూచించింది. దీంతో శ్రీపాద నరేష్ అంత్యక్రియలకు బహ్రెయిన్ వెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వం, ప్రవాసీ సంఘాలు సహాయం చేయాలని అతడి సోదరుడు ధర్మపురి ఆనంద్ కోరాడు.

విద్యార్థుల మధ్య ఘర్షణ..?

వేములవాడ క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ శివారులోని అయ్యప్ప స్వామి ఆలయం వెనుక భాగంలో ఉన్న మైనారిటీ గురుకుల సంక్షేమ విద్యాలయంలో ఈ నెల 26న ఆదివారం విద్యార్థుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలిసింది. మైనారిటీ గురుకుల సంక్షేమ విద్యాలయంలో పదో తరగతితో పాటు ఇంటర్ ఉంది. అయితే పాఠశాల, ఇంటర్ విద్యార్థుల మధ్య టీ తాగే సమయంలో మాటమాట పెరిగి గొడవకు దారితీసిందని, ఈ విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ ఘర్షణకు కారణమైన విద్యార్థులపై చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

తల్లి, కొడుకుపై గొడ్డలితో దాడి

● చికిత్స పొందుతూ తల్లి మృతి

శంకరపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కరీంపేటలో తల్లి కొడుకుపై భార్య, భార్య తరుపు బంధువులు గొడ్డలితో దాడి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కరీంపేట గ్రామానికి చెందిన గడ్డం మల్లవ్వ (65), తన కొడుకు గడ్డం రాజుపై రాజు భార్య, భార్య తరుపు బంధువులు గొడ్డలితో దాడి చేశారు. దాడిలో మల్లవ్వ, రాజు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలిలంచారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మల్లవ్వ మృతి చెందింది. రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. కాగా కుటుంబ కలహాలే ఈ దాడికి కారణమని గ్రామస్థులు పేర్కొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠా అరెస్ట్

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఇళ్లు, ఆలయాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను మెట్‌పల్లి పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్ వెల్లడించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్‌పల్లికి చెందిన ఒల్లెపు కాశీరాం, హైదరాబాద్‌కు చెందిన దండుగుల ఎల్లయ్య, బాన్సువాడకు చెందిన బోడాసు సాయిలులు ముఠాగా ఏర్పడి మెట్‌పల్లి, కోరుట్ల, మల్లాపూర్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, మెదక్ తదితర పట్టణాల్లో తాళం వేసిన ఇళ్లలో, ఆలయాల్లో చొరబడి బంగారం, వెండి, నగదు దొంగతనానికి పాల్పడేవారని తెలిపారు. దొంగిలించిన సొమ్మును పట్టణానికి చెందిన బంగారు వ్యాపారి తునికి వెంకటచారికి విక్రయిస్తుండేవారని పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందంగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి దొంగల ముఠాను గురువారం పట్టణంలోని లక్ష్మీ థియేటర్ సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 20 వేల నగదు, 15 గ్రాముల వెండి, 4 మొబైల్ ఫోన్లు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నాట్లు పేర్కొన్నారు. నిందితులు ఒల్లెపు కాశీరాం, దండుగుల ఎల్లయ్య, బోడాసు సాయిలు, తునికి వెంకటచారిలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వ్యాపారులు, ఇతరులు ఎవరైనా దొంగసొత్తును కొనుగోలు చేసే చట్టాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న మెట్‌పల్లి పోలీసులు

సింగరేణి కాంట్రాక్టు కార్మికుడికి గాయాలు

ముత్తారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు, ఎన్ఎస్‌యూఐ నాయకుడు చేనవేన సాయికుమార్‌కు రోడ్డు ప్రమాదంలో గాయాలయ్యాయి. గురువారం సింగరేణిలో పనిముగించుకొని ఇంటికి తన ద్విచక్రవాహనంపై వస్తున్న క్రమంలో బేగంపేట ఎక్స్‌రోడ్డు వద్ద ఒక్కసారిగా కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయలు ఆసుపత్రికి తరలించారు.

ఏఎల్‌పీలో సపోర్ట్‌మెన్‌కు అస్వస్థత

రామగిరి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీలో సపోర్ట్‌మెన్ గురువారం అస్వస్థతకు గురయ్యాడు. ఏఎల్‌పీలో పి-షిఫ్టుల్లో 86లెవల్ వద్ద విధులు నిర్వహిస్తున్న సపోర్ట్‌మెన్ తోట రవి అస్వస్థతకు లోనై పనిస్థలంలో కిందపడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు రవిని హుటాహుటిన సర్ఫేస్‌కు తరలించారు. అనంతరం అంబులెన్స్‌లో సెంటినరీకాలనీ డిస్పెన్సరీకి తరలించారు. స్థానిక డిస్పెన్సరీ వైద్యుడి ప్రథమచికిత్స అనంతరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మరమ్మతులకు నోచుకోని వైకుంఠధామం



శ్రీనివాస్‌నగర్‌లో నిరుపయోగంగా ఉన్న వైకుంఠధామం

మానకొండూర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో నిర్మించిన వైకుంఠధామం నిరుపయోగంగా మారింది. శ్రీనివాస్‌నగర్ గ్రామంలో ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోవడంతో సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మానేరు వాగు పక్కన రూ. 9లక్షల ఉపాధిహామీ నిధులతో నిర్మించారు. ఉపయోగంలో లేకపోవడంతో పిచ్చి చెట్లు మొలిచి అధ్వానం గా మారింది. నిర్మాణాలు కూడా చెడిపోయాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామం ఉపయోగంలో లేకుండా పోతోందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరవ తీసుకొని మరమ్మతు పనులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పాము పట్టివేత

ముత్తారం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశనపల్లి గ్రామంలోని చొప్పరి రవి ఇంట్లో గురువారం పాము చొరబడింది. సమాచారం అందుకున్న అటవీశాఖ సెక్షన్ అధికారి నర్సయ్య, పాములు పట్టే గడ్డం శ్రీకాంత్ సహాయంతో ఇంట్లో దూరిన పామును పట్టుకుని, అటవీ ప్రాంతంలో వదిలేశారు.

మత్తు పదార్థాలపై ముమ్మర తనిఖీలు

ధర్మపురి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని పాన్ షాపు, కిరాణం షాపుల్లో పోలీస్ నార్కోటిక్ జాగిలాలతో, బాంబు డిస్పోజల్ టీమ్ సభ్యులు గురువారం తనిఖీలు నిర్వహిం చారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ధర్మపురి పట్టణంలో డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజబుల్ (బీడీ) టీమ్ సభ్యుల సహకారంతో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సమయంలో బస్‌స్టాండ్ పరిసర ప్రాంతాలను ఒక్కొక్కటిగా పరిశీలించారు. అనుమానస్పద వస్తువులు, ప్యాకేజీలు, సంచులు లేదా భద్రతకు ముప్పు కలిగించే అంశాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో తనిఖీలు నిర్వహించడం వల్ల పటిష్ట భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేయడం జరుగుతుందని అన్నారు. పాన్ షాపుల్లో గంజాయి పదార్థాలను గుర్తించే జాగిలాలతో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఎస్ఐ ఉదయ్‌కుమార్, రవీందర్ కుమార్, డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజబుల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.



ధర్మపురిలో జాగిలాలతో తనిఖీలు

ఉధృతంగా నీరుకుళ్ల మానేరు వాగు

సుల్తానాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ లోయర్ మానేరు డ్యాం గేట్లను ఎత్తివేయడంతో పెద్ద ఎత్తున వరదనీరు సుల్తానాబాద్ మండల పరిధిలోని గొల్లపల్లి, నీరుకుల్ల, గట్టెపల్లి, తొగ్గరాయి తదితర మానేరు పరివాహక ప్రాంత గ్రామాల్లోని వాగులకు చేరింది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. నీరుకుల్లలో చెక్‌డ్యాం మీదుగా వరదనీరు పొంగి పొర్లుతున్నది. మానేరు వాగులో ఉన్న భూనీల సమేత రంగనాయక స్వామి ఆలయం రక్షణగోడల వరకు నీరుచేరింది. చెక్ డ్యాంను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున వస్తున్నారు.



పొంగిపొర్లుతున్న నీరుకుళ్ల మానేరు వాగు చెక్ డ్యాం

వెంకటాపూర్ వాసికి డాక్టరేట్

కోరుట్ల రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన అనుమల్ల మహేష్ ఉస్మానియా విశ్వవిద్యాలయం మైక్రో బయోలాజీ డిపార్ట్‌మెంట్ నుంచి డాక్టరేట్‌కు ఎంపికయినట్లు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. 'ఐచిప్ సపోర్టెడ్ ఐసోలేషన్, ఐడెంటిపికేషన్ అఫ్ నావెల్ తెరాపిటిక్ మైక్రోబ్స్ టు ట్రీట్ షైపర్ యురిసేమియా' అనే అంశంపై చేపట్టిన పరిశోధనలకు డాక్టరేట్ వచ్చినట్లు తెలిపారు.

బాలుడి వైద్య చికిత్సకు ఫేస్‌బుక్ మిత్రుల విరాళం

జగిత్యాల టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వాకోడూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన అల్లాడి ప్రభాకర్-అనురాధ దంపతుల కుమారుడైన రుద్రాన్ష్ (3) అనే బాలుడు గత కొన్ని నెలలుగా బోన్ మ్యారో వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేక అపన్న హస్తం కోసం ఎదిరి చూస్తున్నారు. ఈ క్రమంలో ధర్మపురి నియోజకవర్గ కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ విషయం తెలుసుకుని సోషల్ మీడియాలో బాలుడి వ్యాధి గూర్చి, తల్లిదండ్రుల పేదరికం గూర్చి పోస్ట్ చేశాడు. స్పందించిన ఎన్నారైలు, స్థానిక దాతలు పలువురు బాలుడి వైద్యానికి తమ వంతు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకువచ్చి తోచిన విధంగా బాలుడి తల్లి బ్యాంక్ ఖాతాకు డబ్బులు పంపించారు. మొత్తం రూ. 1.61 లక్షలు పంపారు. జగిత్యాల టౌన్ పోలీసుస్టేషన్‌లో గురువారం సీఐ కరుణాకర్ చేతుల మీదుగాకొంత మొత్తాన్ని బాధిత బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు.

ప్రాజెక్టుల్లోకి పెరిగిన వరద



ఎల్‌ఎండీ నుంచి విడుదలవుతున్న నీరు

జగిత్యాల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో ప్రాజెక్టులలోకి వరదనీరు రావడం పెరిగింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 1,09,654 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 26 వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి ఒక లక్ష క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 1,09,654 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మిడ్ మానేరుకు భారీగా ఇన్ ఫ్లో

బోయినపల్లి: రాజరాజేశ్వర జలాశయానికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు గురువారం 9675 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు ఎగువ భాగాన కురిసిన వర్షంతో మానేరు, మూలవాగు, వరదకాలువ ఇన్‌లెట్స్ ద్వారా వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో దిగువకు 3 గేట్ల ద్వారా 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 317.69 సామర్థ్యం 27.55 టీఎంసీలకు 26.760 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

ఇల్లంతకుంట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల గురువారంప్రారంభం అయ్యింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.49 టీఎంసీల నీరు ఉంది. క్యాచ్‌మెంట్ ద్వారా 300 క్యూసెక్కుల నీరు వస్తుండగా ఎగువన ఉన్న 11వ ప్యాకేజీలోని రంగనాయక సాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఎల్‌ఎండీలోకి తగ్గుముఖం పట్టిన వరద

తిమ్మాపూర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయం పూర్తి స్థాయిలో నిండుకుంది. తుఫాన్ కారణంగా భారీగా ఎగువ నుంచి వస్తున్న నీటిని గేట్ల నుంచి బయటకు విడుదల చేస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం దాదాపు 12గంటల వరకు కూడా కేవలం 1,277క్యూసెక్కుల నీరు మాత్రమే ఎల్‌ఎండిలోకి ఇన్‌ఫ్లోలు వస్తుండగా ఒక్కసారిగా కురిసిన భారీ వర్షం కారణంగా ఎగువ నుంచి అర్ధరాత్రి వరకు 66వేల క్యూసెక్కులకు పెరిగిపోయింది. దీంతో బుధవారం మధ్యాహ్నం కేవలం ఎల్‌ఎండీ రెండు స్పిల్‌వే గేట్లు ఎత్తి 4వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు క్రమంగా మిడ్ మానేరు నుంచి, మోయతుమ్మెద వాగు నుంచి వరద ఉధృతి భారీగా వస్తుండటంతో 14 స్పిల్‌వే గేట్లు ఎత్తి 66వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గురువారం వర్షం తగ్గుముఖం పట్టడంతో ఎగువ నుంచి కూడా వస్తున్న వరద కూడా తగ్గుతుండటంతో గేట్లు క్రమంగా మూసివేశారు. ఎల్‌ఎండి పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టిఎంసిలు కాగా ప్రస్తుతం 22.918 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 6,896 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 274 టీఎంసీల నీరు బయటకు విడుదల చేస్తున్నారు.

ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలింపు చేపట్టండి

● దంపతుల గల్లంతుపై స్పందించిన బండి సంజయ్

భగత్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చెరువులో గల్లంతైన భార్యాభర్తల కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మల్లంపల్లి చెరువులో గల్లంతైన భార్యాభర్తల సమాచారం కోసం సిద్దిపేట కలెక్టర్‌కు ఫోన్ చేశారు. గల్లంతు వివరాలు తెలుసుకున్నారు. ఈ విషయంలో అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. స్థానిక బీజేపీ శ్రేణులు సహాయ చర్యల్లో పాల్గొనాలని, వర్ష ప్రభావ ప్రాంతాల్లో పర్యటించాలని పిలుపునిచ్చారు.

పీఎం కిసాన్ కోసం ఎదురుచూపులు



● కొత్త రైతులకు వర్తించని పథకం
● తగ్గుతున్న అర్హుల సంఖ్య

చొప్పదండి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2019లో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రవేశపెట్టింది. అర్హులైన రైతులకు ఏటా ఆరు వేల రూపాయలను మూడు విడతల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం జమ చేస్తుంది. ఈ పథకం కోసం అర్హులైన రైతులను దరఖాస్తు చేసుకోవాలని 2019 జనవరి 31 గడువు విధించింది.

కటాఫ్ తేదీగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం అర్హులైన రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందజేస్తుంది. కటాఫ్ తేదీని పొడగించక పోవడంతో కొత్త రైతులకు పథకం వర్తించడం లేదు. దాదాపు ఏడు సంవత్సరాలు కావస్తున్నా కటాఫ్ తేదీని పొడగించకపోవడంతో అనేకమంది రైతులు ఏళ్ల తరబడి పథకం కోసం ఎదురుచూస్తున్నారు.

2019 జనవరి తర్వాత భూములు పొందినవారు పీఎం కిసాన్ పథకం వర్తింపజేయాలని కోరుతున్నారు. కొత్త పట్టాదారు పాస్‌బుక్ ఉండి, రైతు మరణిస్తే వారసులు విరాసత్ ద్వారా భూములు పొందినవారు మాత్రమే కొత్తగా పీఎం కిసాన్ పథకం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకు 20 విడతలుగా పెట్టుబడి సహాయాన్ని ఈ పథకం కింద అందించగా, తాము వేలాది రూపాయలను కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్పులతో తగ్గుతున్న సంఖ్య..

పీఎం కిసాన్ పథకంలో కొత్త నిబంధనలు, నూతన మార్పులతో ప్రతి ఏటా లబ్దిదారుల సంఖ్య తగ్గిపోతుంది. 10 వేల రూపాయలకు పైగా పింఛ న్ తీసుకునే రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ పథకానికి అనర్హులుగా ప్రకటించగా ఆదాయపన్ను చెల్లించేవారు, విదేశాల్లో నివాసం ఉండేవారు అనర్హులు. రైతు దంపతులకు వేర్వేరు గ్రామాల్లో భూములు ఉన్నా ఒక్కరికే వర్తిస్తుంది.

పీఎం కిసాన్ కోసం ఫార్మర్ రిజిస్ట్రీ..

పీఎం కిసాన్ పథకంతోపాటు ఇతర పథకాల కోసం కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీని తీసుకువచ్చింది. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రిలో తమ భూ వివరాలు, ఇతర వివరాలను పొందుపరిస్తే ఒక యూనిక్ ఐడీ నంబర్‌ను కేటాయించారు. ఆధార్ కార్డు మాదిరిగా ప్రతి రైతుకు ఒక కార్డును ఈ రిజిస్ట్రీ ద్వారా అందజేయనున్నారు. నాలుగు నెలల కింద ఈ ప్రక్రియను అన్ని గ్రామాల్లో చేపట్టగా దాదాపు 95 శాతం పూర్తయింది. రైతులందరు ఏఈవోల వద్ద ఫార్మర్ రిజిస్ట్రీలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కాగా ఫార్మర్ రిజిస్ట్రీ ద్వారానే పీఎం కిసాన్ 21వ విడత సహాయం అందజేస్తారని సమాచారం. కొత్త రైతులు తమకు అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా కోరుతున్నారు.

పీజీ సెమిస్టర్ ఫలితాలు

గణేశ్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూలై 2025న నిర్వహించిన పీజీ, నాలుగు, రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. ఎం.ఏ(ఇంగ్లీష్, ఎకనామిక్స్ సోషియాలజీ, తెలుగు, ఉర్దూ), ఎంకాం. (జనరల్, ఫైనాన్షియల్ అకౌంటింగ్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఇన్సూరెన్స్), ఎంఎస్సీ (వృక్షశాస్త్రం, రసాయనశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, గణితం, మైక్రోబయాలజీ, ఫిజిక్స్ ఇంజనీరింగ్ ఫిజిక్స్ స్టాటిస్టిక్స్ న్యూట్రిషన్ డైటెటిక్స్ ఫూస్ సైన్స్ జువాలజీ), ఎంఎస్‌డబ్ల్యూ ఫలితాలు విడుదల చేశారు.

6న శ్రీశైలానికి ప్రత్యేక బస్సు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల6న గోదావరిఖని ఆర్‌టీసీ బస్టాండ్ నుంచి శ్రీశైలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్లు గోదావరిఖని ఆర్‌టీసీ డిపో మేనేజర్ నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం, దేవిశక్తి పీఠం, పాతాళగంగ దర్శనం చేసుకుని 7వ తేదీ సాయంత్రం శ్రీశైలంలో బయలుదేరి 8వ తేదీ ఉదయం గోదావరిఖనికి చేరుకుంటుందని, ఈ సర్వీస్‌కు గోదావరిఖని నుంచి రూ.2200, పెద్దపల్లి నుంచి రూ.2100, కరీంనగర్ నుంచి రూ.2000చార్జిని నిర్ణయించినట్లు, ఈ అవకాశాన్ని గోదావరిఖని, పెద్దపల్లి, కరీంనగర్ వాసులు ఉపయోగించుకోవాలని కోరారు.

ఘనంగా గోదావరి హారతి



ధర్మపురి గోదావరి వద్ద హారతి



కొండగట్టులో కార్తీక దీపాలు



వేములవాడలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ధర్మపురి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి దీపం వెలిగించాలని ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ అన్నారు. కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో తొమ్మిదవ రోజు గురువారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఏడాదిలో పవిత్ర మాసంగా భావించే కార్తీక మాసం సందర్భంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా సాయంత్రం వేళలో గోదావరి నదికి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం నది వద్ద శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి వరకు గోదావరి మాతకు హారతి ఇచ్చి భక్తి శ్రద్ధలతో నదిలో దీపాలు వదిలి పెట్టారు.

కొండగట్టులో..

మల్యాల: కార్తీకమాసం పురస్కరించుకొని కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న కార్తీక దీపోత్సవం కొనసాగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు గురువారం రాత్రి దీపాలు వెలిగించారు. వేద పాఠశాల విద్యార్థులు, భక్తులు భజన, చాలీసా పారాయణం నిర్వహించారు.

వేములవాడలో...

వేములవాడ కల్చరల్ : వేములవాడ శ్రీభీమేశ్వర ఆలయంలో గురువారం కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి పలు ఆకృతుల్లో దీపాలను వెలిగించి పూలతో అలంకరించారు. అనంతరం అర్చకులకు దీపాదానం చేశారు. భీమేశ్వర స్వామివారిని ముంబై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నందేశ్ ఎస్. దేశ్‌పాండే దర్శించుకున్నారు.

చదువుల బంగారాలు.. అక్కాచెల్లెళ్లు



నర్మద



నీరజ

చందుర్తి అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు చదువులో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు అందుకోనున్నారు. మండలంలోని లింగంపేటకు చెందిన కాదాసు నర్మద, నీరజలది పేద కుటుంబం. ఇద్దరు అగ్రహారం కళాశాలలో 2020-22 విద్యా సంవత్సరంలో తెలుగులో ఎంఏ పూర్తిచేశారు. ఆధునిక కవిత్వం అనే అంశంలో నర్మద, జానపద విజ్ఞానం అనే అంశంలో నీరజ అత్యధిక మార్కులు సాధించారు. నవంబరు 7న కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో అక్కాచెల్లెళ్లిద్దరూ బంగారు పతకాలను గవర్నర్ చేతుల మీదుగా అందుకోనున్నారు.

గాయపడిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి

సుల్తానాబాద్, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కాట్నపల్లి గ్రామంలో కనుకదుర్గ రైస్‌మిల్లులో బాయిలర్ పేలిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని లేబర్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు కుతాడి శివరాజ్ డిమాండ్ చేశారు. కార్మిక అధికారులు, సివిల్ సప్లయి అధికారులు విచారించి కనకదుర్గ రైస్‌మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు పెట్టి, చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్మికులకు న్యాయం జరిగే వరకు లేబర్ యూనియన్ ఆందోళన చేస్తుందని హెచ్చరించారు.

ధర్మపురి వద్ద పెరిగిన గోదావరి నీటి ప్రవాహం

ధర్మపురి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి నది నీటి మట్టం గురువారం పెరిగింది. తుఫాను కారణంగా గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి వాగుల ద్వారా ప్రవహిస్తున్న నీరు నదిలో చేరుతోంది. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టు లోనికి భారీగా వరద నీరు చేరింది. కడెం ప్రాజెక్టు సంబంధించిన 4 గేట్లు ఎత్తి అధికారులు దిగువ గోదావరి నదిలోకి 34,514 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. సాయంత్రం 5 గంటల వరకు గోదావరి నదీ స్నానఘట్టాలు ఆనుకుని ప్రవహిస్తోంది. ఎస్‌ఆర్‌ఎస్‌పీ నుంచి 26 గేట్లు ఎత్తి 1,00,000 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి విడుదల చేయడం వల్ల భారీగా వరద చేరి ప్రమాద స్థాయికి చేరుకుంది. నదీ తీరాన గల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



ధర్మపురి వద్ద స్నానఘట్టాలు ఆనుకొని ప్రవహిస్తున్న గోదావరి నది

రైతు కష్టం నీటిపాలు



కాల్వశ్రీరాంపూర్‌లో నీట మునిగిన పంటను చూపిస్తున్న రైతు



పెగడపల్లి మండలం ఆరవెల్లిలో నీట మునిగిన ధాన్యం



ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో తడిసిన ధాన్యం ఆరబోస్తున్న రైతులు



గొల్లపల్లిలో మొలకెత్తిన వరి ధాన్యాన్ని చూపుతున్న రైతు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొంథా తుఫాన్ పంటలపై తీవ్ర ప్రభావం చూపింది. బుధవారం కురిసిన భారీ వర్షానికి ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం కళ్ల ముందే కొట్టుకుపోయింది. కోతకు వచ్చిన పంట నీట మునగడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



హుజూరాబాద్ మండలం జూపాకలో...

చొప్పదండి మండలం మంగళపల్లిలో నేలవాలిన మొక్కజొన్న



తిమ్మాపూర్ మండలం రేణికుంటలో నీట మునిగిన వరి





ధర్మారం మండలం మల్లాపూర్‌లో తడిసిన ధాన్యం చూపుతున్న రైతు



తిమ్మాపూర్ మండలం జుగుండ్ల గ్రామంలో తడిసిన ధాన్యం ఆరబెడుతున్న రైతు



ధర్మపురి మండలం తిమ్మాపూర్‌లో తడిసిన పత్తి

చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం





కోనరావుపేట మండలం బావుసాయిపేటలో కొట్టుకుపోయిన ధాన్యం


చెర్లబుత్కూర్‌లో నేలవాలిన వరి


లక్ష్మీదేవిపల్లిలో వరద నీటిలో ధాన్యం కుప్పలు


నగునూరులో ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

అన్నదాతపై మొంథా పంజా

కరీంనగర్ రూరల్, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో కురిసిన భారీ వర్షానికి పంటలకు తీవ్ర పంట నష్టం వాటిల్లింది. కోతకు వచ్చిన వరి నేల వాలింది. పత్తి పంటలోకి వరద నీరు చేరింది. కొనుగోలు కేంద్రాలోని ధాన్యం తడిసింది. గురువారం కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు వల్లంపహాడ్, తీగలగుట్ట పల్లిలో పంట నష్టాన్ని పరిశీలించారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలో పలు కాలనీల్లోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిలకవాగు బ్రిడ్జి వరకు వరద వచ్చి చేరింది.

హుజూరాబాద్‌రూరల్: మండలంలో పలువురు రైతులకు చెందిన ధాన్యం నీళ్లలో కొట్టుకుపోయింది. చెల్పూర్ పెద్ద చెరువు నిండి పొలాలకు వెళ్లే దారిపై వరద నీరు ప్రవహించింది. ధర్మరాజుపల్లిలో లక్ష్మి, వెంకట్రావ్‌పల్లెలో రాజయ్య, సురేందర్, సదానందం ఇళ్లు దెబ్బతిన్నాయి.

శంకరపట్నం: నష్టపోయిన పంటలను మండల వ్యవసాయాధికారి వెంకటేష్ గురువారం పరిశీలించారు. కేశవపట్నంలో దుర్గం వెంకటమ్మ, మొలంగూర్‌లో జంపాల పోచయ్య ఇళ్లు పాక్షింగా దెబ్బతిన్నాయి. కేశవపట్నం గ్రామానికి చెందిన ఆరెపల్లి తిరుపతికి చెందిన రెండు గేదెలు వాగులో చిక్కుకొని మృతి చెందాయి. అర్కండ్ల వాగు, గద్దపాక బ్రిడ్జిపై నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

సైదాపూర్: వెన్కేపల్లి తుమ్మల చెరువు కట్టు కాలువ తెగి వరద నీరు ప్రవహించడంతో పెద్ద ఎత్తున ధాన్యం కొట్టుకుపోయింది. హుస్నాబాద్-హుజూరాబాద్ ప్రధాన రహదారిలో సైదాపూర్ వద్ద లోలెవల్ వంతెన పైనుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయియి. సోమారం చౌరస్తా జలమయమైంది. సోమారం వాగు ఉధృతంగా ప్రవహించింది. గైచెరువు, బొమ్మకల్ చెరువు మత్తడి పోస్తుండడంతో గొడిశాల-బొమ్మకల్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

వీణవంక: బేతిగల్, ఘన్ముక్ల, వల్భాపూర్, నర్సింగాపూర్ చల్లూరు, గంగారం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది.

మానకొండూర్: మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మానకొండూర్‌లోని చెరువుకట్ట కింద కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోగా కాల్వతవ్వి నీరు కిందికి వెళ్లేలా చేశారు.

తిమ్మాపూర్: మండలంలోని పోలంపల్లి సమీపంలోని లోలెవెల్ బ్రిడ్జి కొట్టుకుపోయింది. నీళ్లలో నుంచి వెళుతున్న ఇసుక ట్రాక్టర్ నీటిలో నిలిచిపోయింది. పోలంపల్లి- మొగిళిపాలెం గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తిమ్మాపూర్-పోరండ్ల మధ్యలో కల్వర్టు నుంచి భారీగా వరద నీరు ప్రవహిం చడంతో రెండు మధ్య రాకపోకలు స్తంభించాయి. అలుగునూర్ శివారు కాలనీలు వరదనీరు, మురుగు నీటితో కాలువలను తలపించాయి.

చొప్పదండి: మండలంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది.

గంగాధర: కొనుగోలు కేంద్రాల్లో మొకాలు లోతు నీరు నిలిచి ధాన్యం తడిసింది. గంగాధర మార్కెట్‌యార్డులో వరదకు సుమారుగా 15 బస్తాల వడ్లు కొట్టుకుపోయాయి.

గన్నేరువరం: మండల కేంద్రంలోని చెరువు నీరు కల్వర్టుపై నుంచి ప్రవహించడంతో ఎస్‌ఐ నరేందర్ రెడ్డి స్టాపర్లను ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. మండలంలోని జంగపల్లి, పారువెల్ల లోలెవల్ కల్వర్టులపై వరదనీరు ప్రవహించ డంతో రాకపోకలు నిలిచిపోయాయి.

చిగురుమామిడి: మండలంలోని సీతారాంపూర్, బొమ్మనపల్లిలో రోడ్డు తెగి ప్రజలకు ఇబ్బంది కలిగింది. ఇందుర్తి ఎల్లమ్మ వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బొమ్మనపల్లికి చెందిన కౌలు రైతు మంద బాబు మూడెకరాల పొలం కొట్టుకుపోయింది. జగ్గని రవీందర్ అనే రైతు వవ్యసాయ బావి పూర్తిగా కూలిపోయి, రెండు ఎకరాల వరిలో ఇసుక మేటలు వేసింది. రేకొండలో ఎరుకొడ రమేష్‌కు చెందిన రెండు పాడి ఆవులు, ఒక లేగదూడ వరద నీటిలో కొట్టుకుపోయి మృతిచెందాయి.

ఇల్లందకుంట: మండలంలోని పాతర్లపల్లె సమీపంలోని వంతెన పైనుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం తహసీల్దార్ రాజమల్లు, ఎస్సై క్రాంతికుమార్ పరిశీలించి ప్రజ లను జాగ్రత్తగా ఉండాలని సూచించారు.


మత్తడి దూకుతున్న గన్నేరువరం చెరువు


సైదాపూర్‌లో నాల్ చెరువు


నగునూరులో నేలవాలిన వరి

● సంక్షిప్తంగా..

హుజూరాబాద్: డిపోలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డిపో హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, ఎస్‌టీఐ సారయ్య, గ్యారేజ్ సిబ్బంది తదితరులు పాల్గొనారు.

కరీంనగర్ కల్చరల్: వావిలాలపల్లి సీతారామచంద్రస్వామి దేవాలయ 28వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అధ్యయనోత్సవాలు ముగిశాయి. శుక్రవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి.

కరీంనగర్ రూరల్: నగునూర్‌లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. మండల రెవెన్యూ ఆఫీసర్ కనకరాజు, నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని కపిల్ బాల కుటీర్ సీసీఐ హోమ్‌లో గురువారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. సీడబ్ల్యూసీ సభ్యుడు కళింగ శేఖర్, డీసీపీవో పర్వీన్, డీసీపీయూ పూదరి శాంత సందర్శించారు.

కరీంనగర్ కల్చరల్: నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో గురువారం సుదర్శన హోమం నిర్వహించారు. ఎస్‌వీఎస్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని సీతంపేటలో తహసీల్దార్ రాజమల్లు ఆధ్వర్యంలో గురువారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు.

కరీంనగర్ కల్చరల్: కార్తీక మాసంస సందర్భంగా మహాశక్తి దేవాలయంలో శుక్రవారం నుంచి నవంబరు 6వ తేదీ వరకుశివ వైభవంపై మహేశ్వరశర్మ ప్రవచనం ఉంటుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

వీణవంక: నర్సింగాపూర్‌కు చెందిన చంద్రగిరి పోచయ్య మృతి చెందగా కుటుంబానికి జాంబవంతుని హమాలీ సంఘం నాయకులు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ శివారు బొమ్మకల్‌లో దేవాలయాన్ని రక్షించాలని స్థానికులు గురువారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్లు 125,126, 129లో ప్లాటింగ్ చేసి ఆలయానికి స్థలం కేటాయిం చారని, అందులో దేవాలయాన్ని నిర్మించుకొని పూజలు చేస్తున్నామని తెలిపారు. కొందరు ఆ స్థలం తమదంటూ ఆలాయాన్ని తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

కరీంనగర్ కల్చరల్: అఖిల భారత యువజన విద్యార్థి సమైక్య ఉమ్మడి జిల్లా కన్వీనర్ నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గురువారం నగరంలో సదర్ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గోశాలలో గోమాతలను పూజించారు. పురోహితులు, నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్: బొమ్మకల్‌కు చెందిన లయన్ చింతల కిషన్ ఆధ్వర్యంలో బొమ్మకల్ కృష్ణానగర్‌కు చెందిన జంక మల్లవ్వ, జింక శాంత వ్వకు రేకుర్తి కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి ఆపరేషన్లను గురువారం చేయించారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జి ఎనివేరోమెంట్, క్లాత్ బ్యాగ్స్ డిస్టిక్ కో ఆర్డినేటర్ లయన్ చింతల కిషన్‌పటేల్, యంజేఎఫ్ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదు కుంటామని ఆందోళనకుగురికావద్దని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా కల్పించారు. గురు వారం గంగాధర మండలం మంగపేట, ఇస్లాం పూర్, గంగాధరలో ధాన్యం కొనుగోలు కేంద్రా లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు దూలం బాలగౌడ్, తహసీల్దార్ అంబటి రజిత, సింగిల్ విండో, ఏఎంసీ ఉపాధ్యాక్షులు వేముల భాస్కర్, కరుణాకర్, రాజన్న, అజయ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్‌లోని శివాని కాటన్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. మార్కెట్ చైర్మన్ కొత్తూరి మహేష్, వైస్ చైర్మన్ రాజేందర్, మార్కెటింగ్ డీడీ పద్మావతి, కార్యదర్శి సరస్వతి పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులు అధైర్య పడవద్దని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం మండలంలోని రుక్మాపూర్‌లో భారీ వర్షానికి దెబ్బతిన్న పొలాలను ఆయన పరిశీలించారు. రైతులను ఆదుకోవాలని, పంట నష్టం వివరాలను నమోదు చేయాలని కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

హుజూరాబాద్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని హుజూరాబాద్ ఏసీపీ మాధవి అన్నారు. గురువారం హుజూరాబాద్ క్లబ్‌లో పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాధవి, సీఐలు కరుణాకర్, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది, యువత రక్తదానం చేశారు. అనంతరం ఏసీపీ మాధవి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల అవసరమైనప్పుడు ప్రాణాలను రక్షించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రక్తం అందక ఎంతో మంది మృతి చెందుతున్నారన్నారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒక్కసారి రక్తదానం చేయాలన్నారు. శాంతి భద్రతల సంరక్షణలో పోలీసులు కీలకమన్నారు. పోలీసు అమరవీరుల సేవలను నిరంతరం స్మరించుకోవాలన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో విద్యార్థులు ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన అశ్వత్‌రావు, కె.రుషిరెడ్డి, అశ్రీత్‌పటేల్ పోటీలకు ఎంపికవడం అభినందనీయమన్నారు.

కొనుగోళ్లను పరిశీలించిన డీడీ

చొప్పదండి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్‌లో శివాని కాటన్ జన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోళ్లను మార్కెటింగ్‌శాఖ డీడీ పద్మావతి పరిశీలించారు. రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకొని పత్తిని మిల్లుకు తీసుకురావాలని తెలిపారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

జిమ్, చిల్డ్రన్స్ పార్క్ ప్రారంభం

జమ్మికుంట,అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో సీపీ నిధుల నుంచి రూ. 1.50లక్షలతో ఏర్పాటు చేసిన జిమ్, చిల్డ్రన్స్ పార్క్‌ను సీపీ గౌస్ ఆలం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జిమ్ పోలీసులకు ఎంతో ఉపయో గకరంగా ఉంటుందన్నారు. అలాగే పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పిల్లలు ఈ పార్క్‌ను ఉపయోగించుకోవచ్చన్నారు. హుజూరాబాద్ ఏసీపీ మాధవి, జమ్మికుంట టౌన్ సీఐ రామకృష్ణ గౌడ్ పనితీరు బాగుందని మెచ్చుకున్నారు. కార్యక్రమంలో ఏసీపీ మాధవి, టౌన్ సీఐ రామకృష్ణ, ఎస్‌ఐలు నాగరాజు, సతీష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తా


పంటను పరిశీలిస్తున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో వాటిల్లిన పంట నష్టాన్ని సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్తానని కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు అన్నారు. గురువారం కరీంనగర్ రూరల్ మండలం నగునూర్, వల్లంపహాడ్, తీగలగుట్టపల్లి గ్రామాల్లో వర్ష ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు భరోసా కల్పించారు. వ్యవసాయ అధికారులు పక్కగా నష్టం వివరాలు అందించాలని సూచించారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారి బి.సత్యం, నాయకుడు కొలగాని అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రంగనాయకస్వామి ఆలయ పునరుద్ధరణ


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

గన్నేరువరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో పురాతన శ్రీరంగనాయక స్వామి దేవాలయ పునరుద్ధరణ, విగ్రహ పునఃప్రతిష్ఠాపన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ఆలయ పునరుద్ధరణ కార్యక్రమాలకు శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో శ్రీనివాస్, వేద పండితులు మామిడాల నాగసాయిశర్మ, నాయకులు కొమ్మెర రవిందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి


కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షానికి కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గురువారం గంగాధర మండలం గట్టుబూత్కూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అకాల వర్షానికి కేంద్రాలకు విక్రయానికి తీసుకువచ్చిన ధాన్యం తడిసి పోయిందన్నారు. కొర్రీలు పెట్టకుండా మద్దతు ధర చెల్లించాలన్నారు. ఇబ్బందులకు గురిచేస్తే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. పార్టీ మండలాధ్యక్షుడు నవీన్‌రావు, మాజీ సర్పంచ్ విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షంతో అపార నష్టం

(5వ పేజీ తరువాయి)

1,033 ఎకరాల్లో పత్తి పంట నష్టానికి గురైంది. కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ఆరబెట్టిన 6,844 క్వింటాళ్ల వరి ధాన్యం తడిసి పోయిం ది. గంగాధర మండలంలో 1530 ఎకరాల వరి పంట నీట మునిగింది. కొనుగోలు కేంద్రాలకు అమ్ముకునేందుకు రైతులు తీసుకువచ్చిన వరి ధాన్యం తడిసి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్తపల్లి మండలంలో 2500 ఎకరాల్లో వరి, 1200 ఎకరాల పత్తి పంటకు నష్టం వాటిల్లింది. చొప్పదండి మండలంలో 458 ఎకరాల వరి, 35 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నది. తిమ్మాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన 338 ఎకరాల వరి, ఐదు ఎకరాల టమాట పంట పూర్తిగా నీట మునిగింది. జూగుండ్లలోని ఐకేపీ కేంద్రానికి తీసుకొచ్చిన 200 క్వింటాళ్ల ధాన్యం తడిసింది. చిగురుమామిడి మండలంలోని 17 గ్రామాల్లో కురిసిన భారీ వర్షానికి 3,300 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. కొనుగోలు కేంద్రాల్లోని 1,572 క్వింటాళ్ల ధాన్యం తడిసి పోయింది.

● పలు చోట్ల రాకపోకలకు అంతరాయం

మానకొండూర్ మండలంలోని ఈదులగట్టపల్లి-మానకొండూర్ గ్రామాల మధ్యగల లోలెవల్ బ్రిడ్జి నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వెళ్లడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. సైదాపూర్ మండలంలో వెంకపల్లి.. తుమ్మలచెరువు కట్ట కాలువ తెగడంతో వరద ఉధృతంగా ప్రవహించడంతో కల్లాలు, రోడ్లపై ఆరబోసిన వరి ధాన్యం ముద్దయింది. కొన్ని చోట్ల ఆ ప్రవాహానికి ధాన్యం కొట్టుకుపోయింది. హుస్నాబాద్-హుజురాబాద్ ప్రధాన రహదారిలోని సైదాపూర్ సమీపంలోగల లోలెవల్ వంతెన రోడ్డుపై నుంచి, సోమారపు చౌరస్తా వద్ద రోడ్డుపై నుంచి భారీగా వరద నీరు ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురయ్యారు. ఎక్లాస్‌పూర్-సోమారం మధ్య వాగు లోలెవల్ వంతెనపై నుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు అక్కడి చేరుకొని వంతెనపై నుంచి వాహనాలను అనుమతించకుండా దారి మళ్లించారు. హుజురాబాద్ మండలం వెంకట్రావుపల్లిలో మూడు ఇళ్లు, ధర్మరాజుపల్లిలో ఒక ఇళ్లు కూలిపోయాయి. చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లి, సుందరగిరి, ఉల్లంపల్లిలో మూడు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. రేకొండ గ్రామంలో ఇనుగొండ రమేశ్‌కు చెందిన రెండు పాడి ఆవులు, దూడ పశువుల పాక కూలి మృతిచెందాయి. గన్నేరువరం మండలం చెరువు వద్ద కల్వర్టుపై ప్రవహిస్తున్న వరద ప్రవాహంలో బీహార్‌కు చెందిన యువకుడు వెళ్తుండగా నీటిలో కొట్టుకుపోయాడు. స్థానిక మత్స్యకారులు రక్షించారు.

మల్కాపూర్‌లో ఇళ్లను పరిశీలించిన సుడా చైర్మన్

భగత్‌నగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్‌లో నీట మునిగిన ఇళ్లను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. మల్కాపూర్‌లోని లక్ష్మీహోమ్సులోకి వరద నీరు చేరడంతో ఇబ్బందులు పడుతున్న వారితో మాట్లాడారు. ఇళ్లలోకి చేరిన వర్షం నీటిని తాత్కాలికంగా బయటకు పంపించి, సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పంటలను పరిశీలించిన బీఆర్‌ఎస్, సీపీఐ నాయకులు

చిగురుమామిడి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో 17 గ్రామాల్లో గురువారం అన్ని గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న పంటలను రోడ్లను బీఆర్‌ఎస్, సీపీఐ పార్టీల మండల అధ్యక్షులు మామిడి అంజయ్య, నాగెల్లి లక్ష్మరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. రేకొండలో పాడి ఆవులు మృతి చెందిన కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి, సంపత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. రెండు పార్టీల నాయకులు కలిసి పంట నష్టం పరిశీలించడంపై మండలంలో చర్చ జరుగుతోంది.

నేడు, రేపు జిల్లాలో కల్వకుంట్ల కవిత పర్యటన

కరీంనగర్ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్ర, శనివారాల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు జాగృతి బాధ్యులు తెలిపారు. తెలంగాణ జాగృతి జనం బాటలో భాగంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తారు. 11.30 గంటలకు శంకరపట్నం మండలంలోని కల్వల ప్రాజెక్టును సందర్శించి, ఆయకట్టు రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు హుజూరాబాద్ మండలం రాంపూర్‌లో ఇటీవల గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని వర్షిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు కరీంనగర్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తారు. సాయంత్రం 4 గంటలకు రామడుగు మండల కేంద్రంలో శిల్పకళాకారులతో సమావేశమవుతారు. సాయంత్రం 5గంటలకు చొప్పదండి మార్కెట్ యార్డును సందర్శిస్తారు. 6 గంటలకు జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాడి శ్రీనివాస్ ఇంటి వద్ద మహిళలతో మాటాముచ్చటలో పాల్గొంటారు. శనివారం జిల్లా కేంద్రంలో పలువురితో అభివృద్ధి, సమస్యలపై చర్చించనున్నారు.

ఇతర బ్యాంకులకు దీటుగా తీర్చిదిద్దుతాం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో పోటీచేస్తున్న నిర్మల భరోసా ప్యానల్ అభ్యర్థులను గెలిపించాలని, ఇతర బ్యాంకులకు దీటుగా తీర్చిదిద్దుతామని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు కోరారు. గురువారం స్థానిక మైత్రీ హోటల్‌లో విలేకరుల సమావేశంలో అర్బన్ బ్యాంక్ ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోను ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్బన్ బ్యాంక్ ఎన్నికలు పార్టీ జెండాలతో జరిగేవి కాదని, విశ్వాసనీయతకు చిరునామా తమ ప్యానల్ అభ్యర్థులని అన్నారు. మాజీ కార్పొరేటర్లు ఆకుల నర్సన్న, మల్లికార్జున రాజేందర్, కోటగిరి భూమాగౌడ్, కొత్తపల్లి మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు పంజాలస్వామిగౌడ్, అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తాం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): అర్బన్ బ్యాంకు డిపాజిట్లను 200 కోట్లకు పెంచడంతోపాటు అభివృద్ధికి కృషి చేస్తామని కరీంనగర్ అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్, ఇండిపెండెంట్ ప్యానల్ చైర్మన్ కర్ర రాజశేఖర్ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. గురువారం నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థికలావాదేవీలతో కూడిన బ్యాంకులో రాజకీయ పార్టీలు జోక్యం చేసుకుంటే అభివృద్ధిపై ప్రభావం పడుతుందని, పార్టీలకతీతంగా అనుభవజ్ఞులైన అన్ని పార్టీలకు చెందిన 12 మంది నాయకులతో ఇండిపెండెంట్ ప్యానల్‌పై పోటీచేస్తున్నామని తెలిపారు. మాజీ డిప్యూటీ మేయర్ రమేశ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాధాగోవింద మందిరంలో గోవర్ధనపూజ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఉజ్వల పార్క్ సమీపంలో ఇస్కాన్ రాధాగోవింద మందిరంలో గురువారం గోపాష్టమి సందర్భంగా గోవర్ధనపూజ నిర్వహించారు. నిర్వాహకులు డాక్టర్ ఎల్.రాజభాస్కర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రేమానంద ప్రభు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై 1098కి సమాచారం ఇవ్వాలి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, అఘాయిత్యాలపై చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలని మహిళా శిశు సంక్షేమ శాఖ హెల్ప్‌లైన్ ప్రతినిధులు సూచించారు. కరీంనగర్ బ్యాంక్ కాలనీలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన ద్వారా వోక్సీ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో యువతకు గురువారం అవగాహన కల్పించారు.

వెలిచాల రాజేందర్‌రావు ప్యానల్‌ను గెలిపించండి

సుభాష్‌నగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నవంబరు 1న నిర్వహించనున్న అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ప్యానల్‌ను గెలిపించాలని ప్రజామిత్ర ప్రొగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వెలిచాల రాజేందర్‌రావు కొన్ని సంవత్సరాలుగా జిల్లా, రాష్ట్ర జాతీయ సమస్యలపై స్పందిస్తున్నారన్నారు.

న్యాయస్థానం ఏర్పాటుకు బిల్డింగ్ పరిశీలన

శంకరపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో న్యాయస్థానం ఏర్పాటు కోసం బిల్డింగ్‌ను హుజూరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. తహసీల్దార్ సురేఖ, ఎంపీడీవో కృష్ణప్రసాద్, న్యాయవాదులు పాల్గొన్నారు.